ఖరీఫ్ సాగుపై స్పష్టత కరువు

- వర్షాభావ పరిస్థితులు ..
- మునేరులో జాడలేని చుక్కనీరు
- పూడ్చని మునేరు తువ్వకాలువ గండ్లు
- తప్పేలాలేని పంట విరామం
- బోర్ల కింద నారు సిద్ధం చేస్తున్న రైతులు

పెనుగంచిప్రోలు: ఈ ఏడాది కూడా ఖరీఫ్ సాగుపై రైతులకు స్పష్టత కరువైంది. వర్షాభావ పరిస్థితులు, మునేరులో చుక్కనీరు లేకపోవడం, మునేరు తువ్వ కాలువకు పడిన గండ్లను పూడ్చకపోవడం తదితర సమస్యల కారణంగా ఖరీఫ్ వరిసాగు సాగేనా? అని రైతులు మదనపడుతున్నారు. రైతుల గోడు కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం పట్టడం లేదనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.



వేమవరం వద్ద ఇసుక, మొక్కలతో నిండిపోయిన పంట పొలం



ముచ్చింతాల వద్ద బాగుపడని పంట పొలాలు



బోర్లు కింద వరిసాగుకు సిద్ధమవుతున్న పొలాలు

ఏడాదిగా పూడ్చని గండ్లు..

గతేడాది మునేరుకు వచ్చిన భారీ వరదలకు తువ్వ కాలువకు ఐదు కిలోమీటర్ల పరిధిలో 50 గండ్లు పడ్డాయి. ఈ గండ్లను పూడ్చేంచడంలో పదినెలలుగా నియోజకవర్గ ప్రజాప్రతినిధి, కూటమి పాలకులు విఫలమయ్యారు. దీంతో తువ్వకాలువ గండ్ల పూడ్చివేత పనులు ప్రతిపాదనలకే పరిమిత మయ్యాయి. ఈక్రమంలో మునేరు ప్రధాన కాలువకు సాగు నీటిని వదిలినా, మునేరు తువ్వకాలువ గండ్లు పూడ్చివేత చేపట్టకపోవడంతో నీటిని వదిలే పరిస్థితి లేదు. దీంతో మునేరు తువ్వకాలువ వత్సవాయి మండలం ఆళ్లూరుపాడు వద్ద మొదలై వేమవరం, పెనుగంచిప్రోలు, ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు, వెంకటాపురం, శనగపాడు గ్రామాల వరకు సుమారు 3వేల ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గండ్లు పడిన మునేరు ప్రధాన కాలువకు తాత్కాలిక మరమ్మతులు చేసినా తువ్వకాలువ గురించి పాలకులు ఏమాత్రం పట్టించుకోవటం లేదు. మునేరుకు ఎగువన తెలంగాణా రాష్ట్రాల్లో వరదలు వచ్చిన ప్రతిసారీ తువ్వకాలువ కట్టలు తెగిపోవడంతో ఆయకట్టు పొలాలకు సాగునీరు అందడం లేదు. తువ్వకాలువ గండ్లు పూడ్చని కారణంగా వర్షాలు మొదలైతే ఆళ్లూరుపాడు నుంచి మరో మునేరు ఏర్పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆలస్యమైన నాట్లు..

ఖరీఫ్ సీజన్ మొదలై నెల రోజులు అవుతోంది. జులై 15వతేదీ నాటికి వరినాట్లు కూడా పూర్తవుతాయి. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది నాట్లు సంగతి దేవుడెరుగు..నార్లు కూడా పోయని పరిస్థితి నెలకొంది. ఇక వరదల కారణంగా ఇసుక మేట వేసిన, కోతకు గురైన పొలాలను బాగుచేసుకోవడం రైతులకు తలకు మించిన భారంగా మారింది. కొందరు రైతులు అనేక వ్యయప్రయాసలకోర్చి పొలాల్లో ఇసుక మేటలు తొలగించుకుంటూ సాగుకు సిద్ధమవుతుండగా ఖరీఫ్ సాగుకు పరిస్థితులు అనుకూలించని పరిస్థితులతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళనలో రైతులు..

గతేడాది వరదలతో నేటికీ రైతుల భూములు సాగుకు అనుకూలంగా లేవు. గండ్లు పూడ్చక పోవటంతో మునేరు తువ్వకాలువకు నీరు వచ్చే పరిస్థితి లేనందున సుమారు మూడువేల ఎకరాల్లో ఎన్ని ఎకరాల్లో సాగులోకి వస్తుందో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి ఉంది. దీంతో ఈఏడాది వందలాది ఎకరాల్లో పంట విరామం తప్పేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కేవలం మునేరు ఆయకట్టున బోర్లు ఉన్నవారు మాత్రమే నార్లు సిద్ధం చేస్తున్నారు. దీంతో నారుమడులు కూడా కేవలం 30శాతం మాత్రమే సిద్ధం చేశారని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. తువ్వకాలువ గండ్లు పూడ్చివేతకు నిధులు మంజూరయ్యాయని పాలకులు చెప్పడమే మినహా, పనులు ప్రారంభించిన దాఖలాలు లేకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. తువ్వకాలువ గండ్లు పూడ్చాలని కోరుతూ గతనెలలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, నందిగామ మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు ఆధ్వర్యంలో రైతులు పెద్దఎత్తున ఆందోళన చేసినా పాలకులకు ఏమాత్రం పట్టకపోవడంపై రైతులు పెదవి విరుస్తున్నారు. ఇకనైనా నియోజకవర్గ ప్రజాప్రతినిధి, ఇరిగేషన్ అధికారులు స్పందించి తువ్వకాలువ గండ్లుపూడ్చాలని రైతులు కోరుతున్నారు.

రెండుపంటలు కోల్పోయాం..



తువ్వకాలువ ఆయకట్టున మైసమ్మ గండి వద్ద పడిన గండ్లుతో మూడెకరాల్లో వరి పంట మొత్తం కొట్టుకుపోవటంతోపాటు పొలమంతా ఇసుక మేట వేసింది. రెండు సీజన్లు పంట కోల్పోయాను. ఈఏడాది కూడా గండ్లు పూడ్చి తువ్వకాలువకు నీరు వస్తేనే సాగు చేయగలం. కాని ఇప్పటివరకు గండ్లు పూడ్చివేత పనులు చేపట్టలేదు.

–మాదల శ్రీను, వేమవరం, వత్సవాయి మండలం

బీళ్లుగా మారిన పొలాలు..



గండ్లు పూడ్చకపోవటంతో మునేరు తువ్వకాలువకు సాగునీరు వచ్చే పరిస్థితి లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో మొత్తం నాట్లు పడాల్సి ఉండగా వందల ఎకరాల్లో ఇసుక మేటలు, భూమి కోతలతో పాటు చెట్లు మొలిచి బీడులుగా మారాయి. గండ్లు పూడ్చివేతను నిధులు మంజూరయ్యాయని అధికారులు చెబుతున్నారే కాని పనులు మాత్రం ప్రారంభించడం లేదు.

–ఏలూరి శివాజీ, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

సర్టిఫికెట్ల పంపిణీ

నందిగామటౌన్: సుజనా ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న డిజిటల్ సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చైతన్య కళాశాల అధినేత అమరనేని రమేష్‌బాబు సూచించారు. సుజనా ఫౌండేషన్ ద్వారా ఉచిత కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గురువారం ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సుజనా ఫౌండేషన్ సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ కొంగర దుర్గాప్రసాద్, ఉదయ్‌కిరణ్, వేణు, రాంకిషోర్, విరజ, కోమలి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ. 70వేలు విరాళం



వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్ కూకట్ పల్లికి చెందిన తంగెళ్ల ప్రసాద్ రూ. 70వేలను విరాళంగా అందించారు. దాత ప్రసాద్‌కు ఆలయ అధికారులు స్వామి వారి ప్రసాదాలు, శేష వస్త్రం అందజేశారు. ఆలయ అర్చకులు శ్రీరాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిమెంట్ బల్లలు వితరణ

జగ్గయ్యపేట అర్బన్:పట్టణంలోని గెంటేల వెంకట జోగయ్య జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌కు స్థానిక వాకర్స్ అసోసియేషన్ వారు 11సిమెంట్ బల్లలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు యర్రా శ్రీనివాసరావు, మద్దుల జయప్రకాష్ తదితరులు గురువారం హైస్కూల్ పీడీలు మురుకుట్ల శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావుల సమక్షంలో సుమారు రూ.40 వేల విలువైన సిమెంట్ బల్లలను అందజేశారు. మైదానంలో నడిచేవారికి, క్రీడాకారులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా సిమెంటు బల్లలను అందించినట్లు వారు వివరించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తుమ్మేపల్లి నరేంద్ర, కొత్తా రమేష్, తునికిపాటి వెంకటేశ్వరరావు,చింతా వెంకట శేషానందం, పాములపాటి వెంకటేశ్వర్లు, సుగ్గల ఉమామహేశ్వరరావు, చిన్నం సీతారామకృష్ణ ప్రసాద్, హెచ్‌ఎం పారేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్లు

కంచికచర్ల: మండలంలో కీసర గ్రామంలో గురువారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో చెట్టు కొమ్మలు విరిగి జాతీయ రహదారిపై పడ్డాయి. విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు అర్ధగంటసేపు నిలిచిపోయాయి. స్పందించిన టోల్‌ప్లాజా సిబ్బంది రోడ్డుపై పడిన చెట్లకొమ్మలను తొలగించారు.

వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి



చిల్లకల్లు(జగ్గయ్యపేట): చిల్లకల్లు గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు గురువారం గ్రామపంచాయతీ వద్ద ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో పనిచేస్తున్న 15మంది కార్మికులకు ఏడునెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారి జీవనం ఇబ్బందికరంగా మారిందన్నారు. వేతనాలను తక్షణమే అందించాలని కోరారు. లేనిపక్షంలో కార్మికులు సమ్మెబాట పట్టక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు తాళ్లూరి నాగలక్ష్మి,, బత్తుల లక్ష్మీనరసమ్మ, మైసమ్మ, రూపన కృష్ణ, వెంకటరత్నం పాల్గొన్నారు. కార్మికులకు ఆశావర్కర్స్ యూనియన్స్ సభ్యులు అరుణకుమారి, వరలక్ష్మి మద్దతు పలికారు.

శాకంబరి మహోత్సవం

జగ్గయ్యపేటఅర్బన్: ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని బంగారుపేటలో వేంచేసియున్న భ్రమరాంబ సహిత శ్రీయోగేశ్వరాలయంలో అమ్మవారికి శాకంబరి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు రకరకాల కాయకూరలు, పుష్పాలతో ఆలయాన్ని, అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు.

రేషన్ దుకాణం తనిఖీ

నందిగామరూరల్: రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ సురేష్‌బాబు హెచ్చరించారు. పట్టణంలోని మయూరి థియేటర్ ప్రాంతంలోని 45వ రేషన్ దుకాణాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా 50శాతం మందికే రేషన్ సరుకులు పంపిణీ చేశారనే ఫిర్యాదులు రావడంతో దుకాణాన్ని తనిఖీ చేసినట్లు వివరించారు. దుకాణంలోని నిల్వలు, స్టాకు రిజిష్టర్ నిల్వలు ఒకేలా ఉన్నాయన్నారు. పోర్టబిలిటీ ద్వారా 83శాతం పంపిణీ చేసినట్లు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



నందిగామరూరల్: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి పంచాయతీరాజ్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి జ్యోతి సూచించారు. మండలంలోని ఐతవరంలో డివిజన్ అభివృద్ధి కార్యాలయ ఏర్పాటుకు సంబంధించి సచివాలయ భవనంలోని గదులను గురువారం ఆమె పరిశీలించారు. భవనంలోని పలు గదులకు మరమ్మతులు చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని పలు ఇళ్లను సందర్శించి, ఆయా కుటుంబసభ్యులతో మాట్లాడారు. తడిచెత్త, పొడి చెత్తను వేరుచేసి ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు):విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం ధరించి పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఎంఈఓ డి.రవీంద్ర సూచించారు. అనిగండ్లపాడు ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అకడమిక్ సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయులకు సలహాలిచ్చారు. ఉపాధ్యాయులు సమర్థవంతంగా పని చేయాలని ఆదేశించారు. హెచ్‌ఎం శెట్టిపోగు రాము, సీఆర్‌పీ బాబు పాల్గొన్నారు.

మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు



'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీఎమ్మెల్యే జగన్‌మోహనరావు, నేతలు

నందిగామటౌన్: అధికారం కోసం ఇష్టారీతిన హామీలు ఇవ్వడం..అధికారంలోకి వచ్చాక ఆ హామీలను విస్మరించడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని నందిగామ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు విమర్శించారు. 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమంపై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీలు, వాటిని అమలుచేయని విధానంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా పట్టణంలోని 20వార్డుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ మోసాలను అర్థమయ్యేలా వివరించాలన్నారు.

ప్రజలను మోసం చేశారు...

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి నేతలు ప్రజలను మోసం చేశారని జగన్‌మోహనరావు తెలిపారు. ఏడాది కాలంగా ప్రజలకు చేసిందేమీ లేకపోయినా సుపరిపాలన–తొలి అడుగు అంటూ కూటమి పాలకులు మరోసారి ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలను ఇదిగో చేస్తున్నాం.. అదిగో ఇస్తున్నామంటూ అసత్య ప్రచారాలు చేయడమే తప్ప ప్రజలకు అందించిన దాఖలాలు లేవని గుర్తుచేశారు.

బాబుకు బుద్ధి చెప్పడం ఖాయం..

కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలు గమనిస్తున్నారని భవిష్యత్‌లో సీఎం చంద్రబాబుకు బుద్ధి చెప్పడం ఖాయమని జగన్‌మోహనరావు పేర్కొన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కృష్ణ, నాయకులు పాములపాటి రమేష్, దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, యరగొర్ల రామారావు, షేక్ ఖాలిక్, షేక్ జాఫర్, పోతురాజు, షేక్ సైదా, కరి రవీంద్ర, సూరె రామారావు, ముప్పల శ్రీను, షేక్ మున్నా, నల్లమల్లి మురళి, నాదెండ్ల నరేంద్ర, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ దాడులు



జగ్గయ్యపేటలోని దుకాణంలో స్టాకు రిజిస్టర్లు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

జగ్గయ్యపేట: నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాలలో గురువారం ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణాలపై విజిలెన్స్, వ్యవసాయశాఖ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దుకాణాలలోని బిల్లు పుస్తకాలు, లైసెన్స్, స్టాకు రిజిస్టర్లను తనిఖీ చేశారు. లైసెన్స్ కాలపరిమితి ముగిసిన కారణంగా రెన్యువల్ చేయించకపోవడాన్ని గుర్తించారు. జగ్గయ్యపేటలో రూ. 15.26 లక్షల విలువైన 68.8 టన్నుల ఎరువులు, వత్సవాయిలో రూ.6.82 లక్షల విలువ చేసే 35.7 టన్నులు, పెనుగంచిప్రోలులో రూ.లక్ష విలువ చేసే 11.3టన్నుల స్టాకు అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈసందర్భంగా విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ రైతులు కూడా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేస్తే విధిగా రశీదులు పొందాలని సూచించారు. ఈ దాడుల్లో ఏడీఏ హనుమంతరావు, జగ్గయ్యపేట ఏడీఏ భవాని, ఏవోలు వరలక్ష్మి, సత్యనారాయణ, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ నేరాలకు చెక్ : ఎస్ఐ

నందిగామరూరల్: విద్యార్థులు సైబర్ నేరాల బారినపడకుండా అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ అభిమన్యు సూచించారు. స్థానిక చైతన్య కళాశాల విద్యార్థినులకు సైబర్ నేరాలు, మహిళల భద్రత, శక్తి యాప్ వాడకం, మాదక ద్రవ్యాల దుష్ప్రభావం, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ తదితర అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ఫేక్ లింకులు, క్యూఆర్ కోడ్‌లతో మోసాలకు పాల్పడుతూ అమాయకుల ఖాతాల్లోని నగదు కాజేస్తున్నందున అప్రమత్తంగా ఉండాలన్నారు. తెలియని వ్యక్తులకు ఓటీపీ సమాచారాన్ని తెలియజేయవద్దని సూచించారు. కళాశాల సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి డిమాండ్



పేటలో కార్మికులకు మద్దతు పలుకుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

జగ్గయ్యపేట అర్బన్: మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలోని మున్సిపల్ కార్మికుల సమ్మె శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మధ్యంతర భృతి ఇవ్వాలని, పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని, రిటైర్మెంట్ వయస్సును 62ఏళ్లకు పెంచాలని, జీవోనంబరు 36ప్రకారం వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే మున్సిపల్ కార్మిక నాయకులను చర్చలకు పిలిపించి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు డి.నరేంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు పారా ఎలకమ్మ, కార్మికులు కంది రంగమ్మ, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



నందిగామరూరల్: ఆషాఢ మాసం సందర్భంగా భగవాన్ సత్యసాయిబాబా మందిరం ఆధ్వర్యంలో పట్టణంలోని శుకశ్యామలాంబ, మరిడీ మహాలక్ష్మి, వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి గురువారం సారె సమర్పించారు. మహిళలు పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూలు, పండ్లతోపాటు 21రకాలతో కూడిన సారెను మంగళవాయిద్యాలు, మంత్రోచ్ఛరణల నడుమ ఊరేగింపుగా ఆయా ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా ట్రస్ట్ ప్రతినిధులు సుశీల, వాసుదేవరావు, శ్రీనివాస్, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఏడుకొండలు

కంచికచర్ల: విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపర్చే లక్ష్యంతో తమ కళాశాలలో కాడ్, రేవిట్, స్టాడ్ వంటి సాఫ్ట్‌వేర్లపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని కళాశాల చైర్మన్ ముత్తవరపు శ్రీనివాసబాబు తెలిపారు. మండలంలోని పరిటాల ముత్తవరపు వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూల్లో సివిల్ ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న 15మంది విద్యార్థులు విశేషప్రతిభను కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు ఆయా కంపెనీల ప్రతినిధులు నియామక పత్రాలను అందజేశారు.ఈసందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు మాట్లాడుతూ మూడు కనస్ట్రక్షన్ కంపెనీలు వీరిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రారంభ వార్షిక వేతనం రూ.2లక్షలు అందుతుందని వివరించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

సర్వే పరిశీలన

కంచికచర్ల:ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ద్వారా గర్భిణులకు మెరుగైన సేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌వో మాచర్ల సుహాసిని సూచించారు. కంచికచర్ల ప్రణీతకాలనీలో జరుగుతున్న పీఎంజేఏవై సికిల్‌సెల్ ఎనీమియా సర్వేను గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. డాక్టర్ సుహాసిని మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు తగిన సలహాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యురాలు బి.వి. వసుంధర, హెల్త్ సూపర్‌వైజర్ జీవీ రాఘవేంద్రరావు, హెల్త్ అసిస్టెంట్ శివప్రసాద్, ఏఎన్‌ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి సారె సమర్పిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ఈఈ రమ తదితరులు



అమ్మవారికి సారె తెచ్చిన మక్కపేట భక్తులు, తిరుమలగిరి ఆలయ చైర్మన్ కె.భరద్వాజ్

పెనుగంచిప్రోలు: ఆషాఢ మాసం సందర్భంగా పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మవారికి ఆలయ పాలకవర్గ సభ్యులు, ఉద్యోగులు గురువారం సారె సమర్పించి బోనాలు చెల్లించారు. గ్రామంలోని అమ్మవారి రంగుల మండపం వద్ద నుంచి సన్నాయి వాయిద్యాలు, కోలాట నృత్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు. వీరికి ఆలయ వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఈ ఎల్.రమ, సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా మక్కపేట గ్రామం నుంచి శ్రీతిరుమలగిరి ఆలయ చైర్మన్ కొమరగిరి భరద్వాజ్ ఆధ్వర్యంలో, దేశపాలెం నుంచి పెద్దసంఖ్యలో మహిళలు తరలి వచ్చి అమ్మవారికి సారె సమర్పించారు.

ఐదుగురికి స్వల్పగాయాలు

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పంచాయతీలోఇరువురి మధ్య మాటామాట పెరిగి ఒకరిపై మరొకరు దాడులకు దిగడంతో ఐదుగురు గాయపడిన ఘటన చిల్లకల్లులో చోటుచేసుకుంది. ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ కథనం మేరకు వేదాద్రి గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు మధిరకు చెందిన చప్పిడి రాజ్యలతకు ఏడాది కిందట వివాహమైంది. కొంత కాలంగా వారిమధ్య మనస్పర్థలు తలెత్తడంతో సర్దుబాటు చేసేందుకు ఇరు కుటుంబాలు చిల్లకల్లు సమీపంలోని ఫంక్షన్ హాల్‌లో గురువారం పంచాయితీ పెట్టారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఇరుకుటుంబాలు దాడిచేసుకోవడంతో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇరువురి ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పైప్‌లైన్ లీకేజీతో తాగునీరు వృథా



నందిగామరూరల్: నందిగామలోని రైతుపేట సెంటర్‌లో పైపులైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృధాగా పోతోంది. పట్టణంలోని 20వార్డుల్లోని ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్లు లీకేజీ గురై తాగునీరు వృధాగా పోతుండటంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కంచికచర్ల మండలం కీసర గ్రామసమీపంలోని మునేటిలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకం నుంచి పట్టణ ప్రజలకు తాగునీటిని సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ గురువారం లీకేజీకి గురికావడంతో రైతుపేట సెంటర్ ప్రాంతమంతా జలమయమైంది. స్థానికుల సమాచారం మేరకు మున్సిపల్ అధికారులు రక్షిత మంచినీటి పథకం నుంచి పట్టణంలోని ట్యాంకులకు నీటిసరఫరాను నిలిపివేశారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించి లీకేజీని సరిచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.